ఉపాధి వేతనాలేవీ..?

- నియోజకవర్గంలో 29 వేల మంది ఉపాధి వేతనదారులు
- ఆరు వారాలుగా వేతనాల పెండింగ్
- పనులకు ముఖం చాటేస్తున్న వైనం
- ఒక్కొక్కరికి రూ. 8 వేలకు పైగా బకాయిలు



పనులు చేస్తున్న అరొకర వేతనదారులు (ఫైల్)

రాజాం : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం లక్ష్యానికి చిల్లులు పడ్డాయి. ఉపాధి పనులు అంటే గతంలో జాతరలా ఉండేది. గత పక్షం రోజులుగా ఈ పనులపై వేతనదారులకు ఆసక్తి తగ్గింది. ప్రతిరోజూ సగటున ప్రతి మండలంలో 6 నుంచి 13 వేల మంది వేతనదారులు ఈ పనులకు వెళ్లేవారు. ప్రస్తుతం ఈ పనులకు ఒక్కో మండలంలో సగటున 600 మంది కూడా వెళ్తున్న దాఖలాలు లేవు.

చెల్లింపులకు బ్రేక్

ఆరు వారాలుగా ఉపాధి వేతనదారులకు చెల్లింపులు నిలిచిపోయాయి. రోజుకు కనీసం రూ. 300 వేతనం వస్తుందని చెప్పిన అధికారులు చెల్లించడంలో విఫలమయ్యారు. ప్రభుత్వ చొరవ కొరవడడంతో పాటు పాలకులు పట్టించుకోకపోవంతో వేతనదారులకు మే నెలకు సంబంధించి వేతనాలు ఇంత వరకు అందలేదు. మే నెలతో పాటు జూన్ నెలలో కొన్ని రోజుల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. గతంలో ప్రతి 15 రోజులకు ఒకసారి వేతనదారుల బ్యాంక్ ఖాతాల్లో నగదు జమయ్యేది. ప్రస్తుతం ఆరు వారాలుగా వేతనాలు మంజూరు కావడం లేదు. ఒక్కో వేతనదారుడికి 35 నుంచి 45 రోజులకు సంబంధించి వేతనం అందాల్సి ఉంది. సగటున ఒక్కో కూలీకి రోజుకు రూ. 200 చొప్పున లెక్క వేసుకున్నా సుమారు 8 వేల రూపాయలు చెల్లించాల్సి ఉంది. వేతనాలు సక్రమంగా చెల్లించకపోవడంతో కొద్ది రోజులుగా వేతనదారులు పనులకు వెళ్లడానికి వెనుకడుగు వేస్తున్నారు. పనులకు గతంలో రాజాం మండలంలో రోజుకు సుమారు 6 వేల మంది వెళ్తే.. ప్రస్తుతం 150 మంది లోపే వెళ్తున్నారు. వంగర, రేగిడి, సంతకవిటి మండలాల్లో కూడా ఇదే పరిస్థితి ఉంది. రేగిడిలో గతంలో 13 వేల మంది నమోదు కాగా ప్రస్తుతం 8 వందల మంది, వంగరలో గతంలో ప్రతిరోజూ 5200 మంది వరకు నమోదు కాగా ప్రస్తుతం 180 మంది, సంతకవిటిలో గతంలో 4500 మంది వరకు పనులకు వెళ్లగా.. ప్రస్తుతం ఆరు వందల మంది వరకు వెళ్తున్నారు. ఈ విషయమై ఎన్‌ఆర్‌ఈజీఎస్ రాజాం ఏపీడీ ఎం. శ్రీనివాసరావు వద్ద సాక్షి ప్రస్తావించగా.. బిల్లుల చెల్లింపులో జాప్యం వాస్తవమేనన్నారు.

బిల్లులు పడలేదు..



మాకు నెల రోజులవుతున్నా ఇంకా బిల్లులు పడలేదు. దీంతో పనులకు వెళ్లాలన్న ఆసక్తి ఉండడం లేదు. గతంలో 15 రోజుల్లో డబ్బులు పడేవి. ఇప్పటివరకు చేసిన పనులకు డబ్బులు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి ఉంది.

– బివర త్రినాథరావు, ఉపాధి వేతనదారుడు, వన్నలి, రేగిడి మండలం

అంతా పెండింగే..



ఉపాధి పనులకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. సకాలంలో డబ్బులు రావడం లేదు. ఆరు వారాల బిల్లులు చెల్లించాల్సి ఉంది. గతంలో ఎప్పటికప్పుడు బిల్లులు పడేవి. ఇప్పుడా పరిస్థితి లేదు.

– గేదెల సరస్వతి, ఉపాధి వేతనదారు, లక్ష్మీపురం, రాజాం మండలం

నివాళులు..



డాక్టర్ రెడ్డి సత్యారావు భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి, తదితరులు

బొబ్బిలి: ప్రముఖ వైద్యుడు రెడ్డి సత్యారావు వైద్య వృత్తికే వన్నె తెచ్చారని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. సత్యారావు మంగళవారం రాత్రి మృతి చెందిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు బుధవారం ఉదయం డాక్టర్ సత్యారావు పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే పలువురు ప్రముఖులు డాక్టర్ సత్యారావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

పరామర్శ

బొబ్బిలి: టీడీపీ కార్యకర్తల దాడిలో గాయపడిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త కేతిరెడ్డి సాయికుమార్‌ను మాజీ ఎమ్మెల్యే శంబంగి చినప్పలనాయుడు సోదరుడు వేణుగోపాలనాయుడు బుధవారం పరామర్శించారు. పలువురు టీడీపీ నాయకులు మంగళవారం సాయికుమార్‌పై దాడి చేసి గాయపరిచారు. స్థానిక పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న బాధితుడ్ని వేణుగోపాలనాయుడు, తదితరులు పరామర్శించి, ఓదార్చారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ కార్యకర్తలున్నారు.

ఆలయాల్లో ఏకాదశి పూజలు



సంతకవిటి: ఎంఆర్ అగ్రహారం సత్యనారాయణ స్వామి ఆలయంలో స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

రాజాం/వంగర/సంతకవిటి: ఆలయాల్లో ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. రాజాం పట్టణంలోని రాజగోపాలస్వామి, వెంకట సత్యనారాయణ స్వామి, తదితర ఆలయాల్లో.. వంగర మండలంలోని సంగాంలో వెలిసిన సంగమేశ్వరస్వామి ఆలయంతో పాటు వంగర, ఎం.సీతారాంపురం, కొప్పరవలస, రుషింగి తదితర గ్రామాల్లోని ఆలయాల్లో... సంతకవిటి మండలంలోని ఎంఆర్ అగ్రహారం సత్యనారాయణ స్వామి, మిర్తివలస వేంకటేశ్వరాలయం, మందరాడ, కాకరాపల్లి, సంతకవిటి తదితర గ్రామాల్లోని ఆలయాల్లో ఆషాఢ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



రామభద్రపురం: పాతరేగలో కాలువల్లో పూడికలు తొలగిస్తున్న కార్మికులు



తెర్లాం: కవిరాయునివలసలో వీధి కాలువల్లో పూడికలు తీస్తున్న కూలీలు

రామభద్రపురం: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతని ఈఓపీఆర్డీ వెంకటరమణ అన్నారు. ఆయన ఆదేశాల మేరకు పలు గ్రామాలలో ఆయా సర్పంచ్‌ల ఆధ్వర్యంలో బుధవారం పారిశుధ్య పనులు చేపట్టారు. పాతరేగ గ్రామంలో సర్పంచ్ గొట్టాపు పైడిపునాయుడు పర్యవేక్షణలో కాలువల్లో మురుగు తొలగించారు. అలాగే తాగునీటి పథకం ట్యాంక్, బోరుబావుల్లో క్లోరినేషన్ చేపట్టారు. ఈ సందర్భంగా ఈఓపీఆర్డీ వెంకటరమణ మాట్లాడుతూ.. వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

చురుగ్గా పారిశుధ్య పనులు

తెర్లాం: మండలంలోని పలు గ్రామాల్లో పారిశుధ్య పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఎంపీడీఓ బి.మధుసూదనరావు, ఈఓపీఆర్డీ నీలిమ ఆదేశాల మేరకు సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టారు. మండలంలోని కవిరాయునివలసలో సర్పంచ్ తిరుపతినాయుడు ఆధ్వర్యంలో వీధి కాలువల్లో పేరుకుపోయిన పూడికలను తొలగించారు. దోమల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వి.హరి, తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ అగ్రహారంలో..

రాజాం : మండలంలోని వీఆర్ అగ్రహారంలో వారం రోజులుగా పారిశుధ్య పనులు చేపడుతున్నారు. సర్పంచ్ డబ్బాడ ఆదిలక్ష్మి పర్యవేక్షణలో ప్రధాన వీధుల్లోని మురుగుకాలువల్లో చెత్త,చెదారం ఏరి వేశారు. ఈసందర్భంగా వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

అక్రమ నిర్మాణాలను తొలగించాలి

తెర్లాం: పంట పొలాలకు సాగునీరు వచ్చే తెర్లాం దాసరిబంద సాగునీటి కాలువపై ఇంతవరకు చేపట్టిన అక్రమ నిర్మాణాలతో పాటు తాను నిర్మించిన నిర్మాణాన్ని కూడా తొలగించాలని గ్రామానికి చెందిన చింతల వెంకటేశ్ మండల స్థాయి అధికారులను కోరారు. ఈ మేరకు తహసీల్దార్ రాజ్యలక్ష్మి, ఎంపీడీఓ బి. మధుసూదనరావు, పంచాయతీ ఈఓ సూరిబాబులకు బుధవారం ఫిర్యాదు చేశారు.

చిరువ్యాపారి ఔదార్యం



అన్నదానం చేస్తున్న జగన్నాథస్వామి

రేగిడి : మండలంలోని వావిలవలస గ్రామానికి చెందిన చిరువ్యాపారి వారణాశి జగన్నాథస్వామి తన ఔదర్యాన్ని చాటుకున్నారు. తన సంపాదనలో కొంత మొత్తంతో గ్రామంలో ప్రతిరోజూ అన్నదాన కార్యక్రమం చేపడుతున్నారు. గ్రామంలోని శ్రీరామ ధర్మక్షేత్రంలో బుధవారం కూడా 20 మందికి అన్నదానం నిర్వహించారు.

నేడు అవగాహన ర్యాలీ

బొబ్బిలి: ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని బొబ్బిలి మండల న్యాయ సేవాకమిటీ చైర్‌పర్సన్ ఎస్. అరుణశ్రీ తెలిపారు. ఈ మేరకు గురువారం అవగాహన ర్యాలీ చేపడతామని పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు, న్యాయవాదులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఆరోగ్యంపై అవగాహన



ఉంగరాడ అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

రేగిడి : మండలంలోని ఉంగరాడ, ఉనుకూరు, రేగిడి, సంకిలి సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలింతలు, గర్భిణులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. పౌష్టికాహారం తీసుకోవం వల్ల కలిగే లాభాలను వివరించారు. కార్యక్రమాల్లో అంగన్‌వాడీ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఎస్‌ఎన్‌ఎల్‌ను కాపాడుకుందాం

- జేవీవీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎంవీఆర్‌కృష్ణాజీ



సత్కారం పొందుతున్న జేవీవీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎంవీఆర్‌కృష్ణాజీ

విజయనగరం అర్బన్: వేల కోట్ల రూపాయల లాభాల్లో ఉండే బీఎస్‌ఎన్‌ఎల్ టెలికాం సంస్థ పునర్వైభవానికి కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని జనవిజ్ఞాన వేదిక జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎంవీఆర్ కృష్ణాజీ కోరారు. సంస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత దేశ పౌరులపై ఉందన్నారు. జనవిజ్ఞాన వేదిక జిల్లాశాఖ ఆధ్వర్యంలో గురుజాడ పాఠశాలలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలోని పబ్లిక్ సంస్థల మనుగడను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. అనంతరం జిల్లా కమిటీ సభ్యులు కృష్ణాజీని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎ.ఆనంద్, ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, జాతీయ సహాయ కార్యదర్శి డాక్టర్ పైల రమేష్, గండ్రేటి అప్పలనాయుడు, శ్రీను, జిల్లా కోశాధికారి రమేష్, నగర ప్రధాన కార్యదర్శి పి.షణ్ముఖరావు, రాజగోప్, సత్యనారాయణ, టి.పైడినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేత్ర వైద్యశిబిరం విజయవంతం



రోగులను తనిఖీ చేస్తున్న జెమ్స్ ఆస్పత్రి వైద్యుడు ప్రసాద్

తెర్లాం: మండలంలోని ఉద్దవోలులో రాగోలు జెమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్యశిబిరం విజయవంతమైంది. శిబిరానికి హాజరైన కంటి రోగులకు డాక్టర్ ప్రసాద్, తదితరులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు కళ్లద్దాలు అందజేయడంతో పాటు కొంతమందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎచ్చెర్ల సునీత, గ్రామపెద్దలు, జెమ్స్ ఆస్పత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నివారణ మందు పిచికారీ



దోమల నివారణ మందు పిచికారీ చేయిస్తున్న పంచాయతీ కార్యదర్శి, వైద్య సిబ్బంది

తెర్లాం: మండలంలోని పూనువలస పంచాయతీ పరిధిలోని కాలంరాజుపేటలో జ్వరాల అదుపునకు అవసరమైన చర్యలను పంచాయతీ, వైద్యశాఖాధికారులు చేపట్టారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి దోమల నివారణ మందు పిచికారీ చేశారు. జ్వరాలు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచ్ ఆర్.రమణమూర్తి, పంచాయతీ కార్యదర్శి మధు తెలిపారు.

సరుకుల పంపిణీ



దత్తత కుటుంబాలకు సరుకులు అందిస్తున్న యువకులు

రాజాం సిటీ: మునిసిపాల్టీ పరిధి పొనుగుటివలస గ్రామానికి చెందిన రెండు దత్తత కుటుంబాలకు అదే గ్రామానికి చెందిన యువజన సంఘ సభ్యులు నెలకు సరిపడా సరుకులు బుధవారం అందజేశారు. గ్రామంలో పెద్దదిక్కును కోల్పోయిన పెదపూడి ఇందుమతి, వడ్డిరాజుల కుటుంబాలకు ప్రతి నెలా మాదిరిగా సరుకులు అందించామని యువకులు రెడ్డి శ్రీనివాసరావు, బెజ్జిపురపు భాస్కరరావు, గాడెపల్లి గోవిందరావు తెలిపారు.

ఆరోగ్యసూత్రాలు పాటించాలి



వార్డుల్లో సమస్యలు తెలుసుకుంటున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్

రాజాం : మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లోని ప్రజలు ఆరోగ్య సూత్రాలు పాటించాలని, అలాగే పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టేలా సహకరించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్ కోరారు. పట్టణంలోని వాసవీనగర్, సారథిరోడ్డు, రాణావీధి, తదితర వార్డుల్లో బుధవారం ఆయన పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు.

పేరుకుపోతున్న చెత్త..



ప్రధాన సీసీ రోడ్డు పక్కనే వేస్తున్న చెత్తాచెదారం

రాజాం : మున్సిపాలిటీ పరిధిలోని మెంతిపేట కాలనీలో చెత్తాచెదారాలు పేరుకుపోతున్నాయి. కాలువల్లో మురుగు నిండిపోవడం, కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు అంటువ్యాధులు ప్రబలుతున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వార్డుల్లో సేకరించిన చెత్తను పారిశుధ్య కార్మికులు సమీపంలోని ప్రధాన రహదారి పక్కనే వేస్తున్నారని, దీంతో దుర్గంధం వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెత్తను యార్డుకు తరలించకుండా, రోడ్డు పక్కనే వేయడంపై గతంలో మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మెంతిపేట కాలనీలో పారిశుధ్య పనులు చేపట్టాలని కాలనీకి చెందిన సూర్యనారాయణ, వెంకటరమణ, లక్ష్మి, చిన్నమ్మడు, తదితరులు కోరారు.

వాసవీ క్లబ్ వనితాశక్తి ప్రారంభం



మాట్లాడుతున్న ఇంటర్నేషనల్ అడ్మినిస్ట్రేటివ్ వైస్ ప్రెసిడెంట్ పేర్ల మహేశ్

రాజాం: వాసవీక్లబ్‌కు అనుసంధానంగా ఏర్పాటు చేసిన వనితాశక్తిని బుధవారం స్థానిక వాసవీ కల్యాణ మంటపంలో క్లబ్ ఇంటర్నేషనల్ అడ్మినిస్ట్రేటివ్ వైస్ ప్రెసిడెంట్ పేర్ల మహేశ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్యవైశ్య కుటుంబాలకు చెందిన మహిళలు ఇందులో సభ్యులుగా చేరవచ్చన్నారు. వనితాశక్తి క్లబ్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు, మోటివేషన్ తరగతులు నిర్వహిస్తారని చెప్పారు. వాసవీక్లబ్ వనితాశక్తి ప్రెసిడెంట్‌గా పొట్టా శ్రీదేవి, కార్యదర్శిగా ఎం.శిరీష, కోశాధికారిగా వై. లలిత,తదితరులు ఎన్నికయ్యారని వెల్లడించారు. ర్యక్రమంలో వాసవీగవర్నర్ ఆత్మకూరి సాంబమూర్తి, కార్యదర్శి జి.నారాయణరావు, కోశాధికారి ఎ.శ్రీనివాసరావు, తమ్మన భాస్కర్, పొట్టా వెంకటేష్‌గుప్త, పొట్టా హరగోపాలం, విజయనగరం క్లబ్ ప్రెసిడెంట్ సీబీజే రావు, కార్యదర్శి కె.రత్నారావు, కోశాధికారి వి.విజయ్‌కుమార్‌తో పాటు సాలూరు, గరివిడి వాసవీ క్లబ్ సభ్యులు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

అనుమతులు తప్పనిసరి


- తహసీల్దార్ బి.రాజ్యలక్ష్మి



డి.గదబవలసలో తవ్వకాల ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు

తెర్లాం: ఎటువంటి అనుమతుల్లేకుండా గనులు, క్వారీల వద్ద తవ్వకాలు చేపడితే చర్యలు తప్పవని తహసీల్దార్ రాజ్యలక్ష్మి హెచ్చరించారు. మండలంలోని డి. గదబవలసలో అనుమతుల్లేకుండా గనుల తవ్వకాలు చేడుతున్నట్లు తహసీల్దార్ దృష్టికి వచ్చింది. దీంతో ఆమె తవ్వకాలపై దర్యాప్తు చేపట్టాలని ఆర్‌ఐ, వీఆర్వోలను ఆదేశించారు. ఈ మేరకు ఆర్‌ఐ, వీఆర్ఓ, డి.గదబవలస సర్పంచ్, స్థానిక పోలీసులు తవ్వకాలు జరుగుతున్న ప్రాంతానికి బుధవారం పరిశీలించారు. అనుమతుల్లేకుండా తవ్వకాలు చేపట్టకూడదని అక్కడే ఉన్న యజమానికి చెప్పగా.. తమకు అన్ని అనుమతులున్నాయని, తహసీల్దార్‌కు చూపిస్తామని బదులిచ్చారు. అనుమతి పత్రాలు చూపించినంతవరకు తవ్వకాలు నిలిపివేయాలని ఆర్‌ఐ అప్పలరాజు సూచించారు. పరిశీలనలో హెచ్‌సీ రాజు, తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న సాగుపై ఆసక్తి



కొండకెంగువలో సాగులో ఉన్న మొక్కజొన్న పంట

- ఎకరాకు రూ.40 వేలకు పైగా ఆదాయం
- 110 రోజుల్లో పంట చేతికి



రొంపల్లిలో మొక్కజొన్న పంటకు పురుగుల మందు పిచికారీ చేస్తున్న రైతులు

రామభద్రపురం: రైతులు ఖరీఫ్ సీజన్‌లో మొక్కజొన్న సాగుపై ఆసక్తి చూపుతున్నారు. తక్కువ కాలం, తక్కువ పెట్టుబడితో తొందరగా పంట చేతికొచ్చే అవకాశం ఉండడంతో ఎక్కువ మంది రైతులు మొక్కజొన్న సాగుకు ముందుకు వస్తున్నారు. మండలంలో ఇప్పటివరకు 575 హెక్టార్లలో సాగు చేపట్టగా.. మరికొద్ది రోజుల్లో మరో 600 హెక్టార్లలో సాగు పెరిగే అవకాశం ఉంది. ఎకరాకు రూ.20 వేల వరకు పెట్టుబడి పెడితే అన్ని ఖర్చులు పోనూ రూ. 30 వేల నుంచి 40 వేల రూపాయల వరకు లాభం వస్తుందని రైతులు చెబుతున్నారు. పంట కూడా కేవలం 110 రోజుల్లో చేతికి వస్తుంది. ఏఓ వెంకటయ్య మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించడం కూడా సాగు విస్తీర్ణం పెరిగేందుకు ఓ కారణమన్నారు. ఖరీఫ్ సీజన్‌లో మండల వ్యాప్తంగా సుమారు 1200 హెక్టార్లలో మొక్కజొన్న సాగయ్యే అవకాశం ఉందని చెప్పారు.

లెప్రసీ రోగులను గుర్తించాలి



బూరాడలో లెప్రసీవ్యాధిపై అవగాహన ర్యాలీ

రేగిడి : ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి లెప్రసీ బాధితులను గుర్తించాలని బూరాడ పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎస్.చలమయ్య, రీనాచౌదరి సూచించారు. బూరాడ గ్రామంలో లెప్రసీ వ్యాధి నిర్మూలనపై బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆగస్టు 2 వరకు రోగుల గుర్తింపు సర్వే జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ రాధాకృష్ణ, సీహెచ్‌ఎస్ సావిత్రి, సూపర్‌వైజర్లు సాయికృష్ణ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో హెచ్‌సీ మృతి



కద్రక బుదురు (ఫైల్)

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఎల్విన్‌పేట పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ కద్రక బుదురు బుధవారం మృతి చెందారు. కొంతకాలంలో అనారోగ్యంతో బాధపడుతున్న హెచ్‌సీ ఆయన స్వగ్రామమైన వంగరలో మరణించారు. ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. సీఐ సత్యనారాయణ, ఎస్సై శివప్రసాద్, తదితరులు సంతాపం తెలియజేశారు.